# సింగిల్ పేజీ కథలు

## చిత్రం

**"నా పేరు శాస్త్రి. రిటైర్డ్ టీచర్‌ని. నా యిల్లు హబ్సీగూడాలో ఉంది. నా యింటిలో దొంగతనం జరిగింది. సుమారు ఆరు తులాల బంగారం, కొన్ని వెండి సామానులు, నగదు చోరీ జరిగింది."**

''మీ ఎడ్రస్, పోయిన వస్తువుల వివరాలు మీకు ఎవరిమీదన్నా అనుమానం ఉంటే ఆ విషయం యివన్నీ రిపోర్ట్ రాసి యివ్వండి. మీ కంప్లైంట్ ప్రకారం మీ యింటికి వచ్చి మా పరిశోధన మొదలుపెడతాం!'' అన్నారు డ్యూటీ పోలీసులు.

కంప్లైంట్ రాసి, బైటకి వచ్చి హోటల్లో భోజనం చేసి యింటికి చేరుకున్నా. పోయిన నా కష్టార్జితాన్ని, నష్టాన్ని అంచనా వేసుకుంటూ బాధపడుతూ కూర్చున్నా.

మధ్యాహ్నం ఒంటిగంటకి స్కూటర్ మీద ఎస్.ఐ. మా యింటికి వస్తూనే ''నమస్తే మేష్టారూ!'' అన్నాడు.

''నమస్తే సార్!'' అన్నాను.

''నన్ను గుర్తుపట్టలేదా మేష్టారూ! నేను ప్రసాద్‌ని. మీ దగ్గర ఆరు సంవత్సరాలు చదువుకున్నాను. ఇంజనీరు రామారావుగారి అబ్బాయిని!'' అన్నాడు.

''హోర్నీ! నువ్వురా! గుర్తుపట్టలేకపోయా!'' అన్నాను.

వాణ్ణి అలా పోలీసు ఆఫీసరుగా చూడ్డం నాకు చాలా సంతోషంగా ఉంది.

''ఔను సార్! ఇంటర్ చదువుతుండగా మా నాన్నగారికి వరంగల్ ట్రాన్స్‌ఫర్ అయింది. అలా వేరే ఊళ్ళల్లో నా చదువు సాగింది. యం.ఏ. తరువాత డైరెక్టు రిక్రూట్‌మెంట్‌లో ఎస్.ఐ.గా చేరాను. ఈమధ్యే నెలక్రిందట ఈ ఊరు వచ్చాను''


''చాలా ప్రయోజకుడివి అయ్యావు!'' అన్నాను మెచ్చుకోలుగా.

''మీకు జ్ఞాపకం ఉందా సార్. ఎప్పుడూ మీరు నన్ను తిడుతూ ఉండేవారు.. నువ్వు ఎందుకూ పనికిరావు'' అని.

ప్రసాద్ ఆ మాట అనగానే నేను కొంచెం చిన్నబుచ్చుకున్నాను.

''మీరిచ్చిన కంప్లైంటులో మీ పేరు చిరునామా చూసి మిమ్మల్ని కలుసుకోవాలని ఆరాటంగా వచ్చాను. ఈ సందర్భంగా కలుసుకోవడం నాకు బాధగా కూడా ఉంది! అన్నట్టు ఆంటీ లేరా!'' అన్నాడు.

''ఊళ్ళో లేదు. మా తోడల్లుడి కూతురు వివాహానికి విజయవాడ వెళ్ళాం. నాలుగు రోజుల క్రిందట. ఆంటీ ఇంకో పదిరోజుల వరకూ అక్కడే ఉంటుంది.''



ఓ పది నిమిషాల పాటు పాత జ్ఞాపకాలతో గడిపాం.

ఈలోగా ముగ్గురు కానిస్టేబుల్స్ వచ్చారు. వాళ్ళు యిల్లంతా తిరిగి రకరకాల పరీక్షలు చేసుకొని, దొంగ పెరటి గుమ్మం పక్క నున్న బాత్రూం లోంచి తలుపులు విరిచేసి బెడ్‌రూంలోకి ప్రవేశించి, బీరువాని మారు తాళాలతో తీసి దొంగతనం చేశాడని నిర్ధారించుకున్నారు.

చోరీకి గురైన బంగారు ఆభరణాలు వెండి సామానులు విడివిడిగా వివరాలు అన్నీ నోట్ చేసుకున్నారు.

''మీరు ఆదుర్దా పడకండి సార్! ఆంటీ ఊరి నుంచి వచ్చేలోగా దొంగల్ని పట్టుకొని మీ సొత్తు మీకు అప్పచెప్పే బాధ్యత నాది, చూస్తారుగా నా శక్తి సామర్ధ్యాలు. ఉంటా సార్!'' అంటూ ప్రసాద్ తన సిబ్బందితో వెళ్ళిపోయాడు.

కార్పెంటర్‌ని పిలిచి బాత్‌రూం, బెడ్‌రూం తలుపులు బాగు చేయించుకున్నాను.

ఈ చోరీ విషయం మా ఆవిడకి తెలియజేయకుండా ఉండడానికి నిర్ణయించుకున్నాను. అసలే ఆవిడ ఆరోగ్యం అంతంతమాత్రం.

వారం రోజులు గడిచాయి. ఈలోగా రెండు సార్లు ప్రసాద్ నా దగ్గరికి వచ్చి ఏవో అనుమానాలు నివృత్తి చేసుకొని వెళ్ళేడు.

మా పక్కవాటావాళ్ళు ఊరి నుంచి వచ్చినా వాళ్ళకి కూడా ఈ విషయం తెలియచెయ్యలేదు.

అనుకోకుండా నేను అర్జంటు పనిమీద కర్నూలు వెళ్ళవలసిన పని తగిలింది. ప్రసాద్‌కి ఈ విషయం తెలియజేసి, ఇంటి తాళాలు పక్కింటివాళ్ళకి యిచ్చి ఊరెళ్ళిపోయాను.

నాలుగురోజుల తరువాత నేను తిరిగి వచ్చేసరికి మా ఆవిడ విజయవాడ నుంచి వచ్చేసింది. ఆ మర్నాడు ప్రసాద్ నుంచి నాకు కబురు వచ్చింది... అర్జంటుగా స్టేషన్‌కి రమ్మనమని. ఈ విషయం మా ఆవిడకి తెలియదు.

''నేను పనిమీద బైటకి వెడుతున్నాను. రెండుగంటల్లో వస్తాను'' అని చెప్పి బయలుదేరుతుంటే ''నేను కూడా ఒకసారి తార్నాకా దాకా వెళ్ళివస్తాను ఈలోపుగా'' అంది మా ఆవిడ. సరే అని నేను స్టేషన్‌కి వెళ్ళేను.

అదృష్టం బాగుండి నా భార్య బీరువా తాళాలు అడగలేదు. అసలు విషయం నేనూ చెప్పలేదు.

స్టేషన్‌లో యిద్దరు దొంగలు ఒకవారగా నిలబడి ఉన్నారు. ప్రసాద్ టేబుల్ మీద కొన్ని బంగారు ఆభరణాలు, కొంత వెండి సామాను పరచి ఉన్నాయి.

ఖచ్చితంగా అవేమీ నావి కావు. ప్రసాద్ మటుకు, ''సార్ ఇవే మీ వస్తువులు మీరిచ్చిన రిపో

ర్టులో ఉన్నవే ఇవన్నీను'' అంటూ రిపోర్టు తయారుచేసి, నాచేత రకరకాల పేపర్ల మీద సంతకాలు పెట్టించుకొని, ''వీళ్ళే సార్ దొంగలు. చోరీ జరిగిన పదిహేను రోజుల లోపలే నేరస్థుల్ని పట్టుకున్నందుకు, నాపై అధికారులు నన్ను ఎంతో మెచ్చుకున్నారు సార్, రండి మిమ్మల్ని యింటివద్ద దింపుతాను. ఒకసారి ఆంటీని కూడా కలిసినట్టుంటుంది.'' అన్నాడు.

నాకు ఇదంతా చాలా అయోమయంగా ఉంది.

ఈలోగా ఏదో అర్జంటు ఫోన్ రావడంతో-

''సార్ నేను మిమ్మల్ని తరువాత కలుస్తాను. మీరు వెళ్ళండి'' అని టేబుల్ మీద పరిచిన వస్తువుల్ని ఒక బ్యాగ్‌లో పెట్టి నాకు అందించాడు.

నేను యింటికి చేరుకొనేసరికి నా భార్య బెడ్‌రూం పరుపుమీద ఆవిడ ఆభరణాలు, వెండి సామాను చూసుకుంటోంది. నేను ఈ ఆభరణాలు పోయాయనే పోలీసు రిపోర్టు యిచ్చింది.

ఒక్కసారిగా నాకు మతిపోయినట్టయింది. విజయవాడ పెళ్ళికి వెళ్ళే ముందురోజు అనుకోకుండా వాళ్ళ చెల్లెలు వస్తే ఆమెకి ఆభరణాలు అవీ ఇచ్చి వాళ్ళింట్లో భద్రపరచమని యిచ్చిందిట. ఇప్పుడు వాటిని తార్నాకా వెళ్ళి తెచ్చుకుంది. ఈ సంగతి నాకు తెలియదు.

మరి ప్రసాద్ రికవరీ చేసిచ్చిన ఈ వస్తువులు ఎవరివి? తేలుకుట్టిన దొంగలాగా మారుమాట్లాడకుండా అవి నేనే ఉంచేసుకోవాలా? కాదని వాపస్ చేసెయ్యాలా?


నాకన్నా నా భార్యే చాలా తెలివైంది ఆవిణ్ణే అడగాలి. ఏం చేద్దామంటుందో?!

ఇంతకీ నా ఇంటికి దొంగతనానికి వచ్చిన దొంగలకి నా యింటిలో ఏవీ దొరకలేదు. నావి మటుకు ఏవీ పోకపోయినా ఎవరి సొత్తో నాకు చే..ది.

అదే విచిత్రం. భళారే విచిత్రం.

**-ముసునూరి కాశీ విశ్వనాథశాస్త్రి**
**(హైదరాబాద్)**

# కాలమహిమ



**"నీ పేరు చెప్పమ్మా" కళ్ళజోడు సరి చేసుకొంటూ అడిగింది అబ్బాయి తల్లి హుందాగా!**

**"శారద" తలవంచుకొని సమాధానం చెప్పింది శారద.**

అమ్మాయికి ''వంటా వార్పూ వచ్చా?'' పెళ్ళికొడుకు వదినగారి ప్రశ్న.

''వచ్చు'' సిగ్గుపడుతూ తల వూపింది శారద.

''వంట ఒక్కటే కాదు కుట్లు, అల్లికలు చక్కగా పాడటం అన్నీ వచ్చు వదినగారూ'' అంటూ వరస కలిపి చెప్పింది శారద తల్లి.

''మీకు పాటలు పాడటం వచ్చా?'' హుషారుగా అడిగింది ఆడపడుచు హోదాలో అబ్బాయి అక్క.

మౌనంగా తలాడించింది శారద.

''ఏది ఒక మంచి కీర్తన పాడమ్మా'' పెళ్ళికొడుకు తండ్రి కలగచేసుకుంటూ అడిగాడు.

అందరూ చుట్టూ కుర్చీల మీద కూర్చుని ఉన్నారు. శారద మధ్యలో చాపమీద కూర్చొని చేతిలో వీణతో చక్కగా అన్నమాచార్య కీర్తన ఆలపించింది.

పాట అయిపోగానే అందరూ ''చాలా బాగా పాడావమ్మా'' అంటూ ఆనందంగా మెచ్చుకున్నారు శారదని.

''అమ్మాయి సాక్షాత్ లక్ష్మీదేవిలా ఉంది. ఒక మంచిరోజు మా అబ్బాయి కూడా వచ్చి చూసిన తరువాత తాంబూలాలు మార్చుకుందాం'' అంటూ నవ్వుతూ చెప్పింది పెళ్ళికొడుకు తల్లి.

''ఇంతకీ అమ్మాయికి అమ్మ, నాన్నలకు ఉత్తరం రాసేపాటి అక్షరజ్ఞానం అన్నా ఉందా?'' అని ఆరాగా అడిగింది పెళ్ళి కొడుకు తల్లి.

''మెట్రిక్యులేషన్ పాసయ్యింది వదినగారు'' చెప్పింది శారద తల్లి. అంతే అప్పటిదాకా ఆనందంగా ఉన్న వారి ముఖాలు వెంటనే వెలవెలపోయాయి. ప్రక్కనే ఉన్న మధ్యవర్తితో ''ఏమయ్యా మాకు ఈ విషయం ముందే ఎందుకు చెప్పలేదు? ఏదో చాకలి పద్దులు రాసుకునే పిల్ల మాకు చాలు అంతే కానీ మెట్రిక్‌లు, పి.యు.సిలు చదివిన పిల్ల మావాడికి అక్కర్లేదు'' అంటూ ఠక్కున లేచి విసవిసా బయటికి నడిచారు.

★ ★ ★

''ఐయామ్ హరి''

''ఐయామ్ దేవి'' ఒకళ్ళనొకళ్ళు పరిచయం చేసుకున్నారు.

''మీ హాబీస్ ఏమిటి?'' ప్రశ్నించాడు హరి.

''పెయింటింగ్, బుక్ రీడింగ్, మ్యూజిక్ వినటం, పాడటం'' సిగ్గుపడకుండా సమాధానం చెప్పింది దేవి.

పెద్దలందరూ హాల్లో ఒకవైపు కూర్చొని మాట్లాడుకొంటుంటే వీరిద్దరూ మరోవైపు సోఫాలో ఎదురెదురుగా కూర్చొని మాట్లాడుకొంటున్నారు. శారదమ్మ వచ్చిన పెళ్ళివారికి అన్ని మర్యాదలు చేస్తూనే మధ్య మధ్య కూతురు హరితో ఎలా మాట్లాడుతోందో అని ఒక కంట కనిపెడుతూనే ఉంది.

''మీ క్వాలిఫికేషన్ ఏమిటి?'' అడిగాడు హరి.

''ఎమ్మెస్సీ ఫిజిక్స్'' చెప్పింది దేవి.

''స్టేట్స్‌లో నాతోపాటు ఈక్వల్‌గా జాబ్ చేయాలి అంటే ఇంజనీరింగ్ అయినా కావాలి లేదా కంప్యూటర్ డిప్లొమా అయినా ఉండాలి. ఇప్పుడు నేర్చుకొంటాను అని చెప్పవద్దు. ఎందుకంటే నాకు అంత టైం లేదు'' అంటూ లేచి నిలబడ్డాడు హరి.

''ఏంటి బాబూ?'' అడిగింది శారద.

''సారీ ఆంటీ మీ అమ్మాయి క్వాలిఫికేషన్ నాకు సరిపోలేదు ఓ.కె. బై'' అంటూ బయటికి దారితీశాడు. మిగతావారు అతన్ని అనుసరించారు. ఆనాటి తన 'పెళ్ళిచూపుల' తంతు గుర్తుకు వచ్చి 'కాలమహిమ' అని నిట్టూర్చింది శారదమ్మ.

**-అడపా పద్మ (జగ్గయ్యపేట)**